# మినీ కథ

## "పాపం రమణమూర్తి"

"అబ్బ ఏం అందం?" అని అనుకోకుండా ఉండలేకపోయాడు రమణమూర్తి ఆ మెరుపుతీగని చూసి.

చెంపకు చేరడేసి కళ్ళు... సంపెంగ పువ్వులాంటి ముక్కు...దొండపండ్ల వంటి పెదవులు...శంఖం లాంటి మెడ... పసిడి కొండలవంటి వక్షద్వయం ... కందిరీగ లాంటి నడుము...నాభిక్రిందికి చీరకట్టి... ఊపిరి పోసుకున్న అజంతా శిల్పంలా ఉందామె! ఆమె నడకలో ఎంత వయ్యారం? రాయంచలు సిగ్గులో తలలు వాల్చుకోవాల్సిందే ఆ నడకని చూసి.

ఆమె నేరుగా తనవైపుకే వస్తుంది!

ముత్యాల వంటి పలువరుస తళుక్కుమనేలా నవ్విందామె!

తననిచూసే?... అవును తనని చూసే!!

తడబడింది రమణమూర్తి హృదయం!

అబ్బ! ఎంత అందమైన నవ్వు?!

"నవ్వులాఅవి కావు నవపారిజాతాలు.." ఏదో సినిమాపాటలోని ఓ చరణం రమణమూర్తి మదిలో మెదిలిందో క్షణం.

"టైమ్ ప్లీజ్?"

"న...నన...నన్నేనా?" తత్తరపడ్డాడు రమణమూర్తి."

"అప్పన్సార్ మిమ్మల్నే?"

"ప..ప...పదిన్నర..."

"మీది నత్తా?" ఆమె కిసుక్కున నవ్వింది.

"అహఁ.. అహఁ... అహఁహఁ ..." అడ్డంగా తలాడించాడు రమణమూర్తి.

"ఇఫ్ యు డోంట్ మైండ్"...ఈ బేగ్ ఓ సారి పుచ్చుకుంటారా?"

లేడీస్ బేగ్ అది. తను దాన్ని పుచ్చుకుంటే... కొద్దిసేపే కావచ్చు... కాని నలుగురూ నవ్వరూ?

అతని సంకోచాన్ని గమనించి, "ఫర్వాలేదులే పుచ్చుకోండి సార్." అంటూ చొరవగా తనే దాన్ని అతనిచేతికందించిందామె. ఆమె చేతివేళ్ళు అతని చేతి వేళ్ళని మెత్తగా స్పర్శించాయ్.

"ఎండ మాడిపోతోంది" స్వగతంలా అంటూ గొడుగు ఓపెన్ చేసిందామె. "అఁ...ఆ బేగ్ ఇలాగిచ్చేయండి" అంటూ అతని చేతిలోంచి దాన్ని తిరిగి తీసుకొంది.

"మీరు కూడా రండిసార్ గొడుక్కిందకి. ఎండలో ఎంతసేపని నించుంటారు?"

ఎంత నిజంగానే మండెత్తిస్తున్నందున ఆమె ఆహ్వానాన్ని తిరస్కరించలేకపోయాడు రమణమూర్తి.

వెళ్ళి గొడుక్కింద ఆమెను తాకీ తాకనట్లుగా నిలబడ్డాడు.

"ఎక్కడి దాకా సార్ మీరు?"

"అక్కయ్యపాలెం..."

"నేనూ అటువేపే లెండి" అంటూ చిన్నగా నవ్విందామె.

ఇద్దరికీ నీడపడేలా ఆమె గొడుగును ఎత్తిపట్టుకోవడంవల్ల స్థాన భ్రంశం చెందిన పమిటను సరిచేసుకోగల స్థితిలో లేదామె! గొడుగు చిన్నది కావడంవల్ల (లేడీస్ గొడుగాయె!) ఆమె అతనికి బాగా దగ్గరగాజరిగి నించోవాల్సివచ్చింది. ఆమె భుజాలు అతని భుజాలను ఒరుసుకుంటున్నాయ్! ఆమె చెయ్యి అతని భుజంమీదుగా మెత్తగావెచ్చగా హత్తుకొంటోంది!

బాడ్‌లక్! ఏదో కొంప అంటుకుపోతున్నట్టు బస్సొచ్చేసింది!

అంత రద్దీగా లేకపోవడంచేత ఈజీగానే ఎక్కగలిగారు.

"ఇలారండి సార్ నా ప్రక్కన చోటుంది" బస్సు ఎక్కాక అందామె తన ప్రక్కన ఖాళీగాఉన్న స్థలాన్ని చూపిస్తూ.

రమణమూర్తి ఒకింత లావు కావడంవల్ల ఆ సీటు సరిగ్గా సరిపోక ఆమెను పూర్తిగా ఆనుకొని కూర్చోవాల్సివచ్చింది.

"ఆహా ఏమీ నా భాగ్యంబు?" అని మురిసిపోవాల్సిన రమణమూర్తి మురిసిపోలేదు సరిగదా, దీర్ఘంగా నిట్టూర్చాడు.

అంత అపురూప సౌందర్యరాశి ప్రక్కన అలా ఆనుకొనికూర్చునే అవకాశం తనకింత వరకూ ఎన్నడూ కలగలేదు.

ఇపుడు కలిగింది. కాని ఏం లాభం?

తన వయసు ఒక్కసారిగా ఓ యాభయ్ ఏళ్ల వెనక్కిమళ్ళి... తను పాతికేళ్ళ కుర్రాడైపోగలిగితే ఎంత బావుణ్ను?!

కానీ... అది సంభవం కావని తెలిసిన డెభ్భయి అయిదేళ్ళ రమణమూర్తి మరోసారి దీర్ఘంగా నిట్టూర్చాడు.

"పాపం ముసలాయన ఎండకి తట్టుకోలేకపోతున్నాడులా ఉంది" అనుకొంది ఆ నిట్టూర్పును ఇంకోలా అర్థంచేసుకున్న ఆ అపురూప సౌందర్యరాశి.

—యం.ఐ. కిషన్
(అల్లీపురం)

---

## వడ్డెపల్లి పదాలు



ఎన్.జీ.వో.సమ్మెతో ఏవీధికేగినా
పెరిగిపోయెను చెత్త మనసా!
ఖుషాయీ, డైవ్‌నే జికూడి సాగేచోట
మనకు కాదది కొత్త తెలుసా?

*

'వికెట్' అంటే ఏమిటో
తెలియకున్ననూ
'క్రికెట్'పై మోజాయె మనసా!
మూడేళ్లవాడికీముదుసలికిసైతమ్ము
మురిపాల ఆటాయె తెలుసా?